క్లుప్తంగా

మల్లికార్జున ఖర్గేను కలిసిన పిల్లుట్ల రఘు



మల్లికార్జున ఖర్గేతో ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు

హుజూర్‌నగర్ : ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేను ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు గురువారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో గత మూడేళ్లుగా ఓజో ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి ఖర్గేకు వివరించినట్లు రఘు స్థానిక విలేకరులకు తెలిపారు.

నేడు మెగా లోక్ అదాలత్

మఠంపల్లి : హుజూర్‌నగర్ కోర్టులో ఈనెల 9న నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మఠంపల్లి ఎస్‌ఐ సీహెచ్.బాలకృష్ణ తెలిపారు. గురువారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంతో పాటు గుండ్లపల్లి, పెదవీడు, రఘునాథపాలెం, మట్టపల్లి, చౌటపల్లి, బక్కమంతులగూడెం, గిరిజనతండాలకు చెందిన వారు రాజీపడే కేసులను పరిష్కరించుకోవాని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో విచారణ



అంగన్‌వాడీ కేంద్రంలో విచారణ జరుపుతున్న సూపర్‌వైజర్

చిలుకూరు : మండల పరిధిలోని రామ్‌చంద్రానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మురిగిన కోడి గుడ్లు పంపిణీ చేస్తున్నారని గురువారం సాక్షిలో ప్రచురితమైన వార్త కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించి విచారణ జరిపారు. సూపర్‌వైజర్ ఉపేంద్ర అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి గుడ్లను ఉడకబెట్టి పరిశీలించారు. చిన్నారులకు నాణ్యమైన గుడ్లు పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సంఘం రాష్ట్ర నాయకురాలు విలాసకవి నిర్మల, సర్పంచ్ పాయిలీ రమేష్, టీచర్ స్వరూప, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోనమెత్తిన మాధవరం



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

మునగాల : మండలంలోని మాధవరంలో గురువారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ప్రదర్శనగా ఆలయానికి వెళ్లి ముత్యాలమ్మకు నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి తమ గ్రామం పాడిపంటలతో కళకళలాడాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎలక బిందు, సర్పంచ్ నంద్యాల విజయలక్ష్మి, బీఆర్‌ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు ఎలక కవిత, గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా మంజూరుకు కృషిచేస్తా



సిరిపురంలో సత్యనారాయణను పరామర్శిస్తున్న కేఎల్‌ఎన్ ప్రసాద్

నడిగూడెం : గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా మంజూరు కోసం కృషిచేస్తానని కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎల్‌ఎన్.ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని సిరిపురంనకు చెందిన గీత కార్మికుడు మొక్క సత్యనారాయణ ఇటీవల తాటి చెట్టు పైనుంచి పడి గాయాలపాలయ్యాడు. దీంతో గురువారం కేఎల్‌ఎన్ ప్రసాద్ ఆయన్ని పరామర్శించి మాట్లాడారు. ఆయన వెంట గ్రామ ఉప సర్పంచ్ శెట్టి సతీష్, స్థానిక సొసైటీ అధ్యక్షుడు మొక్క గురుమూర్తి, పోలంపల్లి వీరబాబు, రామనాథం, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

నాన్ టీచింగ్ సిబ్బందికి పీఆర్సీ అమలు చేయాలి

హుజూర్‌నగర్ : గురుకులాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందికి పీఆర్సీని అమలు చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు అజీజ్ పాషా కోరారు. గురువారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. గురుకుల నాన్‌టీచింగ్ సిబ్బందికి పీఆర్సీ ఏరియల్స్ మొత్తాన్ని వెంటనే ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో వివిధ సొసైటీల పరిధిలో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈమేరకు సీఎం కేసీఆర్, జిల్లా కలెక్టర్‌కు లేఖ పంపుతున్నట్లు చెప్పారు.నాయకులు జక్కుల మల్లయ్య, సుబ్బరాజు, సత్యనారాయణ, మట్టయ్య, జగన్, సైదులు ఉన్నారు.

ఊరూరా కృష్ణాష్టమి వేడుకలు



హుజూర్‌నగర్‌రూరల్ : ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్, ఆలయ చైర్మన్



కోదాడ : వేడుకల్లో చిన్నారులతో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



నేరేడుచర్ల : ఉట్టి కొడుతున్న బాలుడు

కోదాడ : పట్టణంలోని యాదవ బజార్, రంగని గుడిలో గురువారం జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఉన్న చిన్నారులతో కాసేపు సరదాగా గడిపారు.

నేరేడుచర్ల : మండల కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఉట్లు కొట్టి అలరించారు. కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి పట్టణ అధ్యక్షుడు పాల్వాయి రమేష్, వాసవి క్లబ్ అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్, శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాంబాబు, శేఖర్, మధు, వెంకన్న, వేణుగోపాల్‌రెడ్డి, పృథ్వీ తదితరులు ఉన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, ఉత్సవమూర్తులైన చిన్ని కృష్ణుడికి అభిషేకం, విష్ణుసహస్రనామ పారాయణం, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, సర్పంచ్ షేక్ సలీమారంజాన్, ధర్మకర్తలు సురబీ కుషల్, మట్టపల్లి, ఈఓ ఎంపి లక్ష్మణరావు, అర్చకులు హరీష్‌కుమార్ చార్యులు, సిబ్బంది కిరణ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

మునగాల : మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ దేవాలయం ఆవరణలో దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం సభ్యులు ఉట్లు కొట్టారు. ఉట్టి కొట్టే పోటీలలో గెలుపొందిన వారికి దేవాలయ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు.

నడిగూడెం : మండల కేంద్రంలోని ఎస్‌వీఆర్ టెక్నో స్కూల్‌లో గురువారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ కాసాని ఉపేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిలుకూరు : మండలంలోని గ్లోబస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో గురువారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు గోపికలు, కృషుడి వేషధారణలో ఆకట్టుకున్నారు. అదేవిధంగా చిలుకూరు చెన్నకేశవ ఆలయంలో పూజారి అనంతకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఉట్లు కొట్టారు. గ్రామస్తులు, గ్లోబస్ పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ ఉపేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నడిగూడెం : ఎస్‌వీఆర్ స్కూల్‌లో..



చిలుకూరు : గ్లోబస్ స్కూల్‌లో..



మునగాల : ఉట్టి కొడుతున్న యాదవులు

జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలి

● డీఎస్పీ ప్రకాష్

హుజూర్‌నగర్ : పట్టణంలో ప్రతిఏటా నిర్వహించే ముత్యాలమ్మ జాతరను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ ప్రకాష్ అన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆవరణలో ముత్యాలమ్మ జాతర నిర్వాహణ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించే జాతరకు సుమారు 50వేల మంది హాజరు కానున్నట్లు అంచనా వేస్తున్నట్లు తెలిపారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 300 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జాతీయ లోక్ అదాలత్ జయప్రదానికి ప్రతిఒక్కరూ తమవంతు సహాయ సహకారాలను అందించాలని కోరారు. సమావేశంలో సీఐ రామలింగారెడ్డి, ఎస్‌ఐ హరికృష్ణ, జాతర నిర్వాహణ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న డీఎస్పీ, జాతర కమిటీ సభ్యులు

ముస్లింల సభను జయప్రదం చేయాలి

నేరేడుచర్ల : ముస్లింల సమస్యల పరిష్కారం కోసం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈనెల 10వ తేదీన జమీయతే ఉలే మాయే హింద్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల బాధ్యుడు మహ్మద్ అబ్దుల్ బారీ కోరారు. గురువారం నేరేడుచర్లలోని మజీద్‌లో బహిరంగ సభ వాల్ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మౌలానా అబ్దుల్ ఖదీర్, అసన్‌సాయబ్, అబ్దుల్లా, సోయబుల్లా కాత్వీ, మజీద్ కమిటీ సభ్యులు ఖాదర్ పాష, ఇబ్రహీం, యూసుఫ్, జానీ, సోహెల్, కరీం తదితరులు ఉన్నారు.

అంకితభావంతో పనిచేస్తే అవార్డులు



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాగిరెడ్డి

కోదాడ : అవార్డులు బాధ్యతను పెంచుతాయని, మరింత అంకితభావంతో పనిచేయడానికి దోహదపడతాయని కాంగ్రెస్ నాయకుడు పందిరి నాగిరెడ్డి అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన బడుగుల సైదులు, కైలాసం వెంకటేశ్వర్లు, షేక్ అజీజ్‌లను గురువారం ఎంఎస్ కళాశాలలో ఆయన సన్మానించారు. అవార్డు గ్రహీతలు ఇదే ఉత్సాహంతో పని చేసి రాష్ట్రస్థాయి అవార్డులు పొందాలని కోరారు. అదేవిధంగా టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు వీరిని సన్మానించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్.భిక్షం, రామనర్సయ్య, జీఆర్‌కే మూర్తి, డీఎస్ స్వామి, నరసింహారావు, పద్మావతి, హనుమంతరావు, ఎస్ఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

ధరలను నియంత్రించడంలో విఫలం

నడిగూడెం : పెరుగుతున్న ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ అన్నారు. ధరల పెంపును నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన రాస్తారోకోలో ఆయన మాట్లాడారు. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కొరట్ల శ్రీనివాస్, రైతు సంఘం మండల కార్యదర్శి బీరవల్లి సుధాకర్‌రెడ్డి, నాయకులు ఎస్‌కె.మస్తాన్, అనంతుల కృష్ణయ్య, పల్లపు శ్రీనివాస్, వీరయ్య, పాపులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

యాదవుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నేరేడుచర్ల : యాదవుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ లకుమళ్ల జ్యోతి, జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య అన్నారు. గురువారం మండలంలోని ముకుందాపురంలో యాదవులకు రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో 15 యూనిట్ల గొర్రెలను 15 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి రవినాయక్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, ఎంపీటీసీ ఎల్లబోయిన లింగయ్య, సర్పంచ్ మల్లారెడ్డి, నాయకులు శ్రీనివాస్, చిన మల్లయ్య, రంగారెడ్డి, గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు లింగయ్య, గురువయ్య, సుదర్శన్, పశు వైద్య సిబ్బంది నర్సింహచారి, జావిద్, భాస్కర్, స్వప్న, గోపాలమిత్రలు రామయ్య, సైదులు, భుజంగరావు, సాయి కృష్ణ ఉన్నారు.



రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ జ్యోతి

వాసవి, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న వాసవి, వనిత క్లబ్‌ల సభ్యులు

నేరేడుచర్ల : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వాసవి, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు జర్నలిస్టులను సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్త లక్ష్మణ్, వీరవెల్లి శ్రీలత, సంధ్య, కోటేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావు, నటరాజ్, వెంకటేశ్వర్లు, సోమేష్, సుధాకర్, సత్యనారాయణ, కోటేశ్వర్‌రావు, శేఖర్, పరమేష్, అశోక్, హరిబాబు తదితరులు ఉన్నారు.

కేసీ గుప్తా సేవలు మరువలేనివి

కోదాడరరల్ : సమాజ శ్రేయస్సు కోసం స్వాతంత్ర్య సమరయోధుడు, వాసవి క్లబ్ వ్యవస్థాపకుడు కేసీ గుప్తా చేసిన సేవలు మరులేనివని పలువురు ఆర్య వైశ్య నాయకులు అన్నారు. కేసీ గుప్తా జయంతి వారోత్సవాల్లో భాగంగా వాసవి యూత్ క్లబ్, కపుల్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో రువారం కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ పైడిమర్రి సత్యబాబు, రాయపూడి వెంకటనారాయణలు ప్రారంభించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ రిజియన్ చైర్మన్ జగిని ప్రసాద్, పైడిమర్రి వెంకటనారాయణ, పందిరి సత్యనారాయణ, ఓరుగంటి పాండు, బెలిదె అశోక్‌కుమార్, చల్లా లక్ష్మీనర్సయ్య, భరత్‌కుమార్ తదితరులు ఉన్నారు.



కేసీ గుప్తా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెన్నకేశ్వాపురం గ్రామ సర్పంచ్ కలకొండ పుల్లమ్మ కోరారు. గురువారం గ్రామంలో హెల్త్ కేర్ ఆధ్వర్యంలో లేబర్ కార్డు ఉన్న భవన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉపేందర్, నిర్వాహకుడు మేకల నాగరాజు, సీఎస్సీ జిల్లా కోఆర్డినేటర్ బెల్ల తారక్, సీసీ రమేష్, వార్డు సభ్యులు నాగలక్ష్మి, శ్రీను పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

అనంతగిరి : మండలంలోని యసంతాపురం గ్రామ పంచాయతీ కార్మికుడు మొండితోక బాలయ్య (43) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. బాలయ్య మృతదేహాన్ని డాక్టర్ మల్లెబోయిన అంజియాదవ్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి, దహన సంస్కారాలకు రూ.5 వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. తెలంగాణ బీసీ సంఘం నాయకులు కత్తిమాల వెంకన్న, మొక్క రమేష్, బాబు, రాములు తదితరులు ఉన్నారు.

హుజూర్‌నగర్ : పట్టణంలో ఇటీవల మృతిచెందిన కె.ఆంధ్రూపాల్ కుటుంబాన్ని గురువారం తిలక్‌నగర్ అంబేద్కర్ కమిటీ సభ్యులు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు యోహాన్, ఇర్మియ, బాబురావు, అబ్రహం, ఏసురత్నం, కాంతయ్య పాల్గొన్నారు.



అనంతగిరి : ఆర్థికసాయం అందజేస్తున్న డాక్టర్ అంజియాదవ్

ముత్యాలమ్మకు పూజలు

హుజూర్‌నగర్ : పట్టణంలో ముత్యాలమ్మ జాతరలో భాగంగా గురువారం చల్లకుండ ఎత్తే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాతర నిర్వాహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం కేసీఆర్

● ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

నడిగూడెం : సీఎం కేసీఆర్ పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కరివిరాలలో గల రైతు వేదికలో చెన్నకేశ్వాపురం, కరివిరాల గ్రామాలకు చెందిన 46 మంది పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, ఎంపీపీ యాతాకుల జ్యోతి, తహసీల్దార్ టి.నాగేశ్వరరావు, ఎంపీడీఓ యం.యద్రయ్య, సర్పంచ్ కలకొండ పుల్లమ్మ, ఎంపీటీసీ రణబోతు రమాదేవి, సహకార సంఘం చైర్మన్ గోసుల రాజేష్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దేవబత్తిని వెంకటనర్సయ్య, ఉప సర్పంచ్ కృష్ణ, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరివిరాలలో ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

అభివృద్ధి, సంక్షేమమే ఎజెండా

● ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా సీఎం కేసీఆర్ పరిపాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. గురువారం చింతలపాలెంలో 178 మంది లబ్ధిదారులకు, వజినేపల్లిలో 144 మందికి, దొండపాడులో 92 మంది పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రోజుల్లో మొదటి విడతగా 3 వేల మందికి గృహలక్ష్మి పథకాన్ని అమలు చేయబోతున్నట్లు చెప్పారు. రెండవ విడతగా 100 మందికి దళిత బంధు అందించబోతున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేందర్ రెడ్డి, ఎంపీపీ కె.వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, డీసీసీబీ డైరెక్టర్ రంగాచారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ..

చింతలపాలెం మండలం నెమలిపురి గ్రామంలోని యాదవులకు మంజూరైన 20 యూనిట్ల గొర్రెలను గురువారం ఎమ్మెల్యే సైదిరెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటా

హుజూర్‌నగర్ : పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. గురువారం హుజూర్‌నగర్ పరిధిలోని రామస్వామి గుట్ట కాలనీకి చెందిన పులువురు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల విషయంలో బ్రోకర్లను, లంచగొండులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అమర్‌గౌడ్, రామివెట్టి రాము, సోమగాని ప్రదీప్, బండి వెంకటలక్ష్మి నాయకులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి



పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

పండుగలు సంప్రదాయానికి ప్రతీకలు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : భారతీయ సంస్కృతి, సంప్రదాయానికి గ్రామదేవతల పండుగలు ప్రతీకలని ఎమ్మెల్యే సైదిరెడ్డి అన్నారు. గురువారం చింతలపాలెం మండలంలోని తమ్మవరంలో నాభిశిల (బొడ్రాయి), ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి రజిత, జెడ్పీటీసీ చంద్రకళ, ఎంపీటీసీ సైదిరెడ్డి, గుండా బ్రహ్మారెడ్డి, రంగాచారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ఆవశ్యకతపై ముగ్గుల పోటీలు

హుజూర్‌నగర్ : 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆర్డీఓ జగదీశ్‌రెడ్డి అన్నారు. ఓటు హక్కు నమోదు ప్రచారంలో భాగంగా గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో మొదటి బహుమతి లచ్చుమళ్ల విజయకుమారి, రెండవ బహుమతి మద్దెల సుజాత, మూడవ బహుమతి లచ్చుమళ్ల శైలజ గెలుపొందారు. కార్యక్రమం ఎన్నికల నాయబ్ తహసీల్దార్ కమలాకర్, ఆర్ఐ షరీఫ్, ఏపీఎం శైలజ, సంఘ బంధం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మునగాల : మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో గురువారం మహిళ మండల సమైక్య ప్రాజెక్ట్ మేనేజర్ నాగెల్లి నగేష్ ఆధ్వర్యంలో నూతన ఓటర్లకు అవగాహన, ఓటు హక్కు ఆవశ్యకతపై అవగాహనలో భాగంగా మహిళలకు మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి కలకోవకు చెందిన పూజ,రెండవ బహుమతి మండల కేంద్రానికి చెందిన ఎల్.స్పందన, మూడవ బహుమతిని నారాయణగూడెంకు చెందిన మహిళ గెలుచుకున్నారు. కార్యక్రమంలో మండల ఆర్ఐ రాధారెడ్డి, విలేజ్ బుక్ కీపర్స్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

చిలుకూరు : ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రథమ బహుమతి గంటా నాగేంద్రమ్మ, ద్వితీయ బహుమతి మామిడి కవిత, తృతీయ బహుమతి చిలువేరు స్వాతి సాధించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ ఈదయ్య, ఏపీఎం దుర్గాప్రసాద్, సీసీలు గురుమూర్తి, స్వరూప, వీఓఏలు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్డీఓ జగదీశ్‌రెడ్డి

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

హుజూర్‌నగర్‌రూరల్ : అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న ఎంపీడీఓ శాంతకుమారి, సీనియర్ అసిస్టెంట్ చంద్రకళపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశ తీర్మానాలు లేకుండానే కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడంతో పాటు బిల్లులపై సంతకాలు పెట్టాలని తనకు హుకుం జారీ చేశారని తెలిపారు. 23- 3- 2023న బిల్లు చెల్లింపుల నోట్ ఫైల్ అప్రువల్‌పై సంతకం చేయమని కోరగా పనుల నోట్ ఫైల్, తీర్మానం బుక్‌ను పరిశీలన కోసం తనకు ఇవ్వాలని కోరినా నేటికీ ఇవ్వలేదని, పైగా నేను గ్రూప్- 1 అధికారిని నేను ఆమోదించినప్పుడు ఎంపీపీవి నువ్వు ఎందుకు సంతకం పెట్టవంటూ దురుసుగా ప్రవర్తించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల వద్ద పర్సంటేజీలు తీసుకుంటూ ప్రతి పనికి ఒక రేటు పెట్టి వసూళ్లు చేస్తున్నారని, గతంలో ఎస్సీ కార్పొరేషన్ లోన్ల విషయంలో అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎంపీడీఓ గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించడం లేదని, తన సొంత వాహనం వాడుకుంటూ నెల నెల రూ.33,500 తీసుకుంటూ ప్రభుత్వాన్ని మోసం చేస్తుందని ఆరోపించారు. గతంలో ఎంపీడీఓపై పంచాయతీరాజ్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో జెడ్పీ సీఈఓ విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేసినట్లు తెలిపారు. అయినా ఎంపీడీఓ తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ అవినీతి అక్రమాలకు తెరలేపారని ఆరోపించారు. అధికారులు స్పందించి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఎంపీడీఓ, సీనియర్ అసిస్టెంట్‌పై పూర్తిస్థాయి విచారణ చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.



కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న ఎంపీపీ

బస్ షెల్టర్ లేక అవస్థలు

● ఎండ, వానకు ప్రయాణికుల పాట్లు
● రోడ్లకు ఇరువైపులా ఆక్రమణలు

చిలుకూరు : మండల కేంద్రంలో బస్ షెల్టర్ లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఎండ, వానకు సమీప దుకాణాల వద్దకు వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారు. అయితే కోదాడ- హుజూర్‌నగర్ రోడ్డుగా ఉన్నప్పుడు చిలుకూరు బస్టాండ్ సెంటర్‌లో కనీసం బస్సులు నిలిపే ప్రత్యేక స్థలం ఉండేది, అక్కడ బస్సు ఎక్కేందుకు సౌకర్యం ఉండేది.. ఆ తరువాత కోదాడ - జడ్చర్ల నేషనల్ హైవే వేయడంతో రోడ్డు విస్తరణ చేయడంతో చిలుకూరులో బస్టాప్ స్థలం కనుమరుగయింది. దీంతో ప్రయాణికులు నిలబడడానికి కూడా స్థలం లేకుండా అయింది.

ఇరువైపులా రోడ్డు ఆక్రమణ..

అదేవిధంగా బస్ స్టాప్ ప్రదేశం మొత్తం ఆక్రమణకు గురైంది. దూదియాతండా రోడ్డులో ఇరువైపులా ఆక్రమణదారులు ఆక్రమించారు. ఈ విషయంపై గ్రామంలో ప్రతిరోజు చర్చ జరుగుతోంది కానీ ముందుకొచ్చి ఆక్రమణదారులను ప్రశ్నించి ఆక్రమణలను అడ్డుకునే వారే కరువయ్యారు. ఇంత జరుగుతున్నా గ్రామ పంచాయతీ పాలకవర్గం పట్టించుకోవడం లేదు. దీంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. మండల కేంద్రం కావడంతో వివిధ పనుల నిమిత్తం చిలుకూరు గ్రామానికి చుట్టుపక్కల గ్రామాల వారు తరుచుగా వస్తుంటారు. బస్ షెల్టర్‌తో పాటు బైక్, కార్ల పార్కింగ్‌కు స్థలం ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



చిలుకూరులో బస్సులు నిలిపే ప్రదేశం